క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం సిటీ: మండల అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా బి.ఉమాకుమారి, ప్రధాన కార్యదర్శి, ఇతర కార్యవర్గ సభ్యులుగా ఎం.పుణ్యవతి, కాశీరత్నం, లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారని సంఘం గౌరవ అధ్యక్షురాలు పి.ఉమ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులకు సూచనలు చేస్తున్న ఏపీఓ హరనాథ్

రేగిడి: లచ్చారాయపురం గ్రామంలోని గిరిజాలవాని చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీఓ ఎస్.హరనాథ్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం రూ. 300 వస్తుందని చెప్పారు.జాబ్ కార్డు ఉన్నవారే పనులకు హాజరు కావాలని, ఒకరికి బదులు వేరొకరు హాజరు కాకూడదన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ, మేట్లు ఉన్నారు.

రోగులకు అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ శశిభూషణరావు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు 'నేనుసైతం స్వచ్ఛంద సేవాసంస్థ' ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు,ఆస్పత్రి సూపరింటెండెంట్ శశిభూషణరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈసందర్భంగా నిర్వాహకుడు బొంగు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ నాలుగు వందల రోజులుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని చెప్పారు. సంస్థ సేవలను మరింత విస్తృతం చేసేందుకు అంతా సహకరిం చాలని కోరారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు,కౌన్సిలర్లు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నయ్యపేటలో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

తెర్లాం: స్థానిక పశువైద్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా సోమవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువులకు టీకాలు వేయడం ద్వారా వర్షాకాలంలో వ్యాధులు సోకవని, రైతులు తమ పాడి పశువులకు టీకాలు వేయించాలని సిబ్బంది సూచించారు.

ఆడిట్ పరిశీలన



ఆడిట్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఈ చిరంజీవి

రాజాం: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద చేపడుతున్న రాజాం క్లస్టర్ పరిధిలోని డ్వాక్రా సంఘాల రికార్డుల ఆడిట్‌ను డీఆర్‌డీఏ సెర్ప్ ఏఈ ఏ.చిరంజీవి సోమవారం పరిశీలించారు. ఆడిట్ సక్రమంగా చేయించుకోవాలని, ఆడిట్ టీమ్ ఇచ్చిన సలహాలు పాటించాలని వీఓఏలకు సూచించారు. రికార్డుల నిర్వహణలో లోపాలను సరిదిద్దుకోవాలని, సంఘాల ఆర్థికాభివృద్ధికి సీసీలు, సీఎఫ్‌లు సహకరించాలని ఆదేశించారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సోమవా రం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సర్వసభ్య సమావేశమంటే.. అలసత్వమెందుకో..?



రామభద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయం

రామభద్రపురం: ప్రజాసమస్యలపై, మండల అభివృద్ధిపై చర్చించాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు కొందరి అధికారులు తీరువల్ల మొక్కుబడిగా సాగిపోతు న్నాయి.తూతూ మంత్రంగా, రికార్డుల్లో నమోదుకే అన్నట్లు సమావేశాల తీరు ఉంది.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన సమావేశాల తీరు చూస్తుంటే అధికారుల హాజరుతో పాటు నివేదికల వెల్లడిలో అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమావేశాలకు మండల పరిషత్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంటుంది. అధికారులు తమశాఖల్లో జరిగిన ప్రగతిని, చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి నివేదించాలి. వాటిపై సమావేశానికి హాజరైన పాలకులకు ఉన్న సందేహాలు నివృత్తి చేయాలి.గ్రామాల్లో సమస్యల పరిష్కా రానికి, చేపట్టాల్సిన అభివృద్ధిపై ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు తీసుకోవాలి. కానీ ఇవేమీ కానరావడం లేదని సభ్యులు అంటున్నారు. సమావేశాలకు చాలా మంది అధికారులు హాజరు కాకుండా తమ శాఖలకు సంబంధించిన దిగువ స్థాయి సిబ్బందిని పంపిస్తున్నారని, వారికి కనీస అవగాహన ఉండడం లేదని, సందేహాలను నివృత్తి చేయడంలో నీళ్లు నములుతున్నారని మండల ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. హాజరయ్యే అధికారులు వారి శాఖలకు సంబంధించిన నివేదికలను హడావిడి తూతూమంత్రంగా వెల్లడించి, సమావేశం ముగియకముందే ప్రజాప్రతినిధులు కంటే ముందుగానే బయటకు వెళ్లిపోతున్నారు.ఎవరికైనా ఆశాఖకు సంబంధించి సందేహం వచ్చినా నివృత్తి చేసేందుకు సంబంధిత అధికారి లేకపోవడంతో నివ్వెరపోవడం ప్రజాప్రతినిధుల వంతవుతుంది. అధికారులు మధ్యలో ఎందుకు బయటకు వెళ్లిపోతున్నారో ఎవరూ అడగకపోవడం గమనార్హం. ఈ మాత్రం దానికి సమావేశాలు నిర్వహించడం ఎందుకు అంటూ విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.ఈనెల 18వ తేదీన జరగనున్న సమావేశానికి ఎంతమంది అధికారులు హాజరవుతారో, ఎలా జరుగుతుందో చూడాలి మరి.

అధికారులంతా హాజరుకావాలి



సర్వసభ్య సమావేశాలకు మండలస్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలి.తమ శాఖలకు సంబంధించి ప్రజాప్రతినిధుల సందేహాలను నివృత్తిచేయాల్సి ఉంటుంది.మరీ అత్యవసరమైతే తప్ప గైర్హాజరవ్వకూడదు.హాజరైన అధికారులు సమావేశం పూర్తయ్యే వరకు ఉండాల్సిందే. నింబంధనలు పాటించని వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ఈనెల 18వ తేదీన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నాం.మండల అధికారులంతా పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలి.

– రత్నం,ఎంపీడీఓ,రామభద్రపురం

అధికారులే ఇలా చేస్తే ఎలా..?



పాలకులకు ఉన్న సందేహాలు నివృత్తి చేయాల్సిన అధికారులే హాజరవ్వకపోతే ప్రజా సమస్యలను ఎవరితో చెప్పుకుం టాం.హాజరయ్యే కొద్దిమంది అధికారులు కూడా సమావేశం పూర్తికాకుండా ప్రజాప్రతినిధుల కంటే ముందుగానే వెళ్లిపో తే గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధిం చిన ప్రతిపాదనలు ఎవరికివ్వాలో తెలియడం లేదు.ఆ ప్రతిపా దనలు పట్టుకొని పదేపదే కార్యాల యాలకు రావాల్సి వస్తోంది. జవాబుదారీగా ఉండాల్సిన అధికారులే ఇలా చేస్తే ఎలా..?.ఇకనైనా సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరై, సమస్యలను వినాలి, తమ శాఖల ప్రగతిని, చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి నివేదించాలి.

– మజ్జి రాంబాబు,మిర్తివలస సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

చంద్రబాబు అంటేనే మోసం..



'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజేష్, తదితరులు

- రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: చంద్రబాబునాయుడు అంటేనే మోసం, వెన్నుపోటు అని రాజాం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది అప్రజాస్వామిక పరిపాలనపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల సమయంలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చినదానికంటే రెండింతలు సంక్షేమం అందిస్తా మని చంద్రబాబు, పవన్ కల్యాణ్ సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదికాలంలో ఒక్కహామీని కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి పాలన అంతా మోసం, దగా అని విమర్శించారు. వాగ్దానాలను అమలుచేయాలని ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడతామని, త్వరలో ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ రాజాం పట్టణ, మండల, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, వావిలపల్లి జగన్ మోహనరావు, కరణం సుదర్శన రావు, గురుగుబెల్లి స్వామినాయుడు, రాజాం జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, రాజాం వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, డాక్టర్ నరేంద్ర, వంజరాపు విజయ్‌కుమార్, ముదిలి జనార్ధనరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ బి.ప్రసాదరావు, తాలాడ ఎంపీటీసీ సభ్యుడు కనకల సన్యాసినాయుడు, జి.ఎస్.పురం సర్పంచ్ పప్పల ఈశ్వరరావు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

రాజాం సిటీ: శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తున్న జన విజ్ఞాన వేదిక(జేవీవీ)లో అంతా భాగస్వాములు కావాలని జేవీవీ డివిజన్ కార్యదర్శి జి.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జేవీవీ సభ్యులతో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలను పారదోలి, శాస్త్రీయ సమాజంపై అవగాహన కల్పించేందుకు జేవీవీ అంకితభావంతో పనిచేస్తోందని అన్నారు. డివిజన్, జిల్లా, రాష్ట్ర మహాసభల నిర్వహణపై సభ్యులకు వివరించారు. అలాగే రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర మండలాల్లో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసేందుకు సూచనలు చేశారు. అనంతరం జేవీవీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ సభ్యులు జె.నీలయ్య, ఎస్.సత్యనారాయణ, పి.గౌరీశ్వరరావు, పి.వేణుగోపాలరావు, డి.సత్తిబాబు, కామేశ్వరరావు, జగదీష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



రాజాం సిటీ: రాజాంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రేగిడి : రేగిడి తహసీల్దార్ కృష్ణలతకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



తెర్లాం: ఇన్‌చార్జ్ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు,హెల్పర్లు



వంగర: డీటీ హరి రమణారావుకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు



బాడంగి: హెచ్‌డీటీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



బొబ్బిలిరూరల్: ఆర్‌ఐ రామకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లికివందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను తమకూ వర్తింప చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తెర్లాం, వంగర, బాడంగి, రేగిడి, బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయాల వద్ద, రాజాం పట్టణంలో ఆయా మండలాల అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని నెలకు రూ.12వేలు లోపు ఆదాయం ఉన్న వారికి వర్తింపజే స్తామని ప్రకటించిందన్నారు.అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500, హెల్పర్లకు రూ.7 వేలు మాత్రమే గౌరవ వేతనం వస్తోందని, అయినప్పటికీ అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయలేదని అన్నారు.అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలకు తల్లికి వందనం పథకంతో పాటు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, లేదంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌లు, డీటీ, హెచ్‌డీటీలకు వినతిపత్రాలు అందజే శారు. – సాక్షి నెట్‌వర్క్

కార్మికులకు షరతులు లేకుండా పథకాలు అందించాలి



మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికి సమస్యను వివరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

బొబ్బిలి: ఎలాంటి షరతులు లేకుండా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం తల్లికి వందనంతో పాటు ఇతర పథకాలు అందజేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం ధర్నా చేశారు. మహిళలంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసంద ర్భంగా సీఐటీయూ నాయకుడు శంకర్రావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు తల్లికి వందన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద కార్మికుల పిల్లలను అనర్హులుగా గుర్తించి, పథకాన్ని ఆపేయడం సరికాదన్నారు.రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో నివసిస్తున్న కోటిన్నర మంది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న 48 వేలమంది మున్సిపల్ కార్మికులకు ఈ పథకాన్ని వర్తింపజేయకపోవడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు.పెరుగుతున్న నిత్యవసరాలకు అనుగుణంగా వారికి జీతభత్యాలు అందించాలని, ప్రభుత్వ పథకాలను వారికి వర్తింపజేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

సాగునీటి వనరులను ఆధునికీకరించాలి



మాట్లాడుతున్న సాయన్నచానల్ నీటి సంఘం అధ్యక్షుడు జనార్ధనరావు

రేగిడి: మండలంలో సాగునీటి వనరులనువెంటనే ఆధునికీకరించాలని సాయన్నచానల్ నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సాయన్నచానల్ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాయన్నచానల్‌తో పాటు ఆకులలోవకట్ట వంటి సాగునీటి కాలువల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సాయన్నచానల్ షట్టర్లు పూర్తిగా పాడయ్యాయని, పొలాలకు సాగునీరు వెళ్లడం కష్టంగా మారిందని అన్నారు. గత కొన్నేళ్లుగా ఈ చానెల్‌ను అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదికలు పంపించి, ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు.

ఏడాది పాలన అంతా నయవంచనే...

- జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి



'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, నాయకులు

బొబ్బిలి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ఏడాది పాలన అంతా మోసం, వంచన, అరాచకాలే తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు..స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు సూపర్ సిక్స్‌తో పాటు వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఏడాది పాలనలో ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను వంచించారని ఆరోపించారు.తాజాగా తల్లికి వందనం పథకం ప్రారం భించారని, అయితే ఈ పథకంలో భాగంగా అర్హులైన ఎంతోమంది తల్లుల ఖాతాల్లో ఇంకా డబ్బులు జమకాలేదని, ప్రతి గ్రామంలోనూ బాధితులున్నారని అన్నారు. కానీ పథకాన్ని అమలు చేసేశామని సీఎం చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు మంత్రి లోకేష్ గొప్పలు చెప్పు కుంటున్నారన్నారు. ఇప్పటికే పథకాలను అమలు చేయకుండా ఒక ఎడాది ఎగనామం పెట్టారని, అది చాలదన్నట్టు ఇప్పుడు ప్రారం భించిన తల్లికి వందనం పథకం కూడా అరకొరగా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు తల్లికి వందనం పథకానికి అంక్షలు లేవని చెప్పిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ఏవేవో కారణాలను చూపి అర్హులకు పథకాన్ని ఎగ్గొట్టారని విమర్శించారు. సూపర్ సిక్స్‌తో సహా వందలాది హామీలు ఇచ్చారని, వాటిలో ఏఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపి ణీ వ్యవస్థను ఈ ప్రభుత్వం నిలిపివేసి పేదలను ఇబ్బంది పెట్టడమే కాకుండా ఎండీయూ వాహనాల ఆపరేటర్లను రోడ్డున పడేసిందన్నారు. బొబ్బిలి పట్టణంలో రోడ్లన్నీ గోతులు తేలి ఉన్నాయని, ఏడాది కాలంగా ఏం చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రశ్నించే గొంతుకులను నొక్కేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈప్రభుత్వంతో ప్రజలకు ఒరిగిందేమి లేదని, జగన్ ప్రభుత్వానికి, చంద్రబాబు మోసాల ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు చెప్పనవి కూడా ఎన్నో చేశారని, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి,అప్పికొండ శ్రీరాములునాయుడు, కౌన్సిలర్లు బోడిగంజి రమేష్‌నాయుడు,పాలవలస ఉమ,బాడంగి,తెర్లాం మండల నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

రాజాం సిటీ: స్థానిక సీనియర్, జూనియర్ కోర్టుల సముదాయంలో జూలై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ తదితర కేసులను కక్షిదారుల అంగీకారంతో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.న్యాయవాదులు, పోలీసులు ఈ విషయాన్ని కక్షిదారులకు వివరించి, వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంతో విధానంలో సాగుచేసిన కూరగాయలను కొనుగోలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి మండలంలోని బాడంగి, ముగడ క్లస్టర్ల పరిధిలో రైతులు ప్రకృతివ్యవసాయ విధానంలో సాగుచేసిన తోటకూర, వంగ,బీర, చిక్కుడు, తదితర కూరగాయలు , ఆర్గానిక్ బెల్లంను సోమవారం విక్రయించారు.ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ శ్రీలత, మండల పరిషత్ ఉద్యోగులు, ప్రజలు కూరగాయలను కొనుగోలు చేశారు. ముగడ క్లస్టర్‌కు చెందిన ఐసీఆర్‌పీలు వై.సత్యనారాయణ, టి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారీగా తగ్గిపోయిన ఉపాధ్యాయుల సంఖ్య ..!



ఎంఈఓకు రిలీవింగ్, జాయినింగ్ ఆర్డర్లు సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం రోల్ లేకపోవడంతో సుమారు 34 టీచర్ పోస్టుల వర కు తగ్గిపోతున్నట్లు సమాచారం. వివిధ మండలాల నుంచి బదిలీపై మండలానికి వచ్చిన వారు, మండలం నుంచి బదిలీ అయిన ఉపాధ్యా యులు తమ జాయినింగ్ రిలీవింగ్ ఆర్డర్లను సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ పి.లక్ష్మణదొరకు సమర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో విద్యార్థుల రోల్ తగ్గడం వల్ల కేటాయింపుల్లో 23 ఎస్జీటీ పోస్టులు, 14 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తగ్గాయని చెప్పారు. మండలంలో గతంలో 105 ఎస్జీటీ పోస్టులు ఉండగా ఇప్పుడు 82 పోస్టులకు, ,35 స్కూల్ అసిస్టెంట్ పోస్టులుండగా ప్రస్తుతం 24 పోస్టులకు పరిమితమైనట్టు చెప్పారు. ప్రస్తుత బదిలీల కారణంగా ఎనిమిదేళ్ల సర్వీస్ నిండిన 14 మంది ఎస్జీటీలు ఇతర మండలాలకు వెళ్లిపోగా వారి స్థానంలో ఏడుగురు ఇక్కడికి వచ్చారని చెప్పారు. అలాగే ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు బదిలీపై వెళ్లిపోయారని చెప్పారు.

ఆధునిక పద్ధతులు అవలంభించాలి



ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో వరి విత్తనాలు చల్లడంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సభ్యులు

రేగిడి: వ్యవసాయ సాగులో రైతులు ఆధునిక పద్ధతలు అవలంభించి, లాభాలు ఆర్జించాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మీ నరసింహమూర్తి అన్నారు. మండలంలోని చిన్నకోడిశ గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో రైతు నెల్లి నారాయణరావు పొలంలో వెద జల్లే పద్ధతిలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో యంత్రాల వినియోగం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని, మంచి దిగుబడులు పొందవచ్చని లక్ష్మీనరసింహమూర్తి చెప్పారు. రెడ్డీస్ ఫౌండేషన్ నుంచి మండలంలో రెండు ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రాలను అందుబాటులో ఉంచామని, రైతులు వీటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శరత్‌బాబు, ఉమామహేశ్వరరావు, కొండవలస, ఉనుకూరు, ఒప్పంగి తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్ పార్కు పరిశీలన



సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణ సమీపంలోని రామన్నదొరవలస వద్ద ఉన్న మున్సిపాలిటీకి చెందిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కును మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సోమవారం పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో చెత్త ఆరబయట నిల్వ లేకుండా చూడాలని, మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్త వేరుచేసే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పార్కులో ఉన్న మిక్స్‌డ్ వేస్ట్ బెడ్లను క్లియర్ చేసి విశాఖలోని జిందాల్ ప్లాంటుకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికార సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి ఉన్నారు.